భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కేసరపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దారు

గన్నవరం: భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె. వెంకటశివయ్య సూచించారు. మండలంలోని కేసరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు భూ సమస్యలపై గ్రామస్తులు అర్జీలను సమర్పించారు. తహసీల్దారు మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో భూసమస్యలపై 600కు పైగా అర్జీలు వచ్చినట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే మూల్పూరి బాలకృష్ణారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ పొట్లూరి బసవరావు, డెప్యూటీ తహసీల్దారు భవాని, మాజీ వార్డు సభ్యుడు మూల్పూరి మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు

కంకిపాడు: మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తహసీల్దార్ వి.భావనారాయణ అన్నారు. మండలంలోని తెన్నేరు గ్రామంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు స్థానిక రైతులు భూ సమస్యలపై అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భావనారాయణ మాట్లాడుతూ పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తున్నామన్నారు. అర్హులకు సంక్షేమం చేరువ అయ్యేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. కార్యక్రమంలో తెన్నేరు డీసీ చైర్మన్ యార్లగడ్డ రాజారావు, మండల సర్వేయరు భాస్కర్‌రావు, ఆర్ఐ ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తక ప్రియులకు పండుగ..!

- రేపటి నుంచి విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో 35వ పుస్తక మహోత్సవం
- జనవరి 2నుంచి 12వ తేదీ వరకు పుస్తక ప్రదర్శన
- 300 పైగా బుక్ స్టాల్స్
- సందర్శకులకు ఉచితంగా అనుమతి



ఇందిరాగాంధీ స్టేడియం వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: రాష్ట్రంలోనే పుస్తక ప్రియులకు అతిపెద్ద పండుగ వచ్చింది. విజయవాడలోని 35 పుస్తక మహోత్సవానికి శరవేగంగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందిరాగాంధీ స్టేడియం పుస్తక మహోత్సవానికి వేదికైంది. జనవరి 2 నుంచి 12వ తేదీ వరకు 11 రోజుల పాటు పుస్తక మహోత్సవం సాహితీ ప్రియులకు ఆనందం పంచనుంది. సుమారు 300 పైగా ఏర్పాటు చేయనున్న రకరకాల బుక్ స్టాల్స్ సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. ఈ ఏడాది పుస్తక మహోత్సవ ప్రాంగణానికి సాహితీ నవజీవన్ లింక్స్ అధినేత పిడికిటి రామకోటేశ్వరరావు పేరు పెడుతున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ ఏడాది ఆరుద్ర, దాశరథి కృష్ణమాచార్యులు, నాజర్ (బుర్ర కథ పితామహుడు), నార్ల చిరంజీవి, ఆలూరి బైరాగి, ఎన్.నటరాజన్(శారద), సినీ నటి భానుమతి తదితరుల శత జయంతి సభలు నిర్వహించనున్నారు. ప్రతిరోజూ నాకు నచ్చిన పుస్తకం, నన్ను ప్రభావితం చేసిన పుస్తకంపై ఓపెన్ డయాస్‌పై సందర్శకులకు మాట్లాడే అవకాశం కల్పిస్తున్నారు. జనవరి 6వ తేదీ సాయంత్రం 4 గంటలకు పుస్తక ప్రియుల పాదయాత్ర సిద్ధార్థ కళాశాల నుంచి పుస్తక మహోత్సవ ప్రాంగణం వరకు జరుగుతుంది.



స్టేడియంలో చురుగ్గా స్టాళ్ల ఏర్పాటు

గతంలో రానటువంటి ఆంగ్ల ప్రచురణ కర్తలు, అనేక మంది పబ్లిషర్స్ బుక్ స్టాల్స్ ఏర్పాటు చేయడం ప్రత్యేకత.

విద్యార్థుల కోసం..

రతన్‌టాటా ప్రతిభ వేదికపైన విద్యార్థులకు పుస్తక మహోత్సవం జరిగే 11 రోజులూ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. విద్యార్థులకు వక్తృత్వ, ఇచ్చిన అంశంపై కథలు రాయడం, మిమిక్రీతో కథలు చెప్పడం, వాక్‌ఫర్ బుక్స్, డ్రాయింగ్, పుస్తక సమీక్షలు, క్విజ్, శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలపై ఉపన్యాసాలు, మన చుట్టూసైన్స్ అండ్ మ్యాథ్స్, మేజిక్ లాజిక్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఆవరణలో జరిగే 35వ విజయవాడ పుస్తక మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సుమారుగా 238 బుక్ స్టాల్స్, మరో 65 వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నాం. పుస్తక ఆవిష్కరణలు, శత జయంతి సభలతో పాటుగా పలు సాహితీ కార్యక్రమాలు, చర్చా వేదికలు కొనసాగుతాయి. ఉచితంగా సందర్శకులను అనుమతి ఇస్తాం.

–టి.మనోహరనాయుడు, కార్యదర్శి, విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ

సమన్వయంతో ఏర్పాట్లు చేయండి

ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృత్తికాశుక్లా

మచిలీపట్నంటౌన్: అధికారులు సమన్వయంతో ఏర్పాట్లుచేయాలని బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ కమిషనర్ కృత్తికాశుక్లా చెప్పారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో చేయవలసిన సన్నాహక ఏర్పాట్లపై కృత్తికాశుక్లా, సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ రాష్ట్ర డైరెక్టర్ శ్రీనివాసరావుతో కలిసి మచిలీపట్నం లేడీ యాంపిల్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ జనవరి 3న మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని లాంఛనంగా ప్రారంభించే అవకాశం ఉన్నందున సిద్ధంగా ఉండాలని సూచించారు. నూరు శాతం ఉత్తీర్ణత, ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలగా గుర్తింపు తీసుకురావాలని ఆమె సూచించారు. కళాశాల తరగతి గదిలో జూనియర్, సీనియర్ ఇంటర్మీడియెట్ విద్యార్థులతో పాఠ్యాంశాలపై ముఖాముఖి నిర్వహించారు. పాఠ్యపుస్తకాలు అందరికీ అందాయా లేదా.. లెక్చరర్ల బోధన ఏ విధంగా ఉంది అని విద్యార్థులను అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. డిజిటల్ క్లాస్ రూమ్‌లో ఆన్‌లైన్ పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కళాశాలలో విద్యార్థులకు అందుబాటులో ఉన్న బయాలజీ, కెమిస్ట్రీ ల్యాబ్‌లను ఆమె పరిశీలించారు. ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఆర్వో ప్లాంట్ పనితీరును పరిశీలించారు.

- కళాశాలలో ఇప్పటికే పూర్తైన అభివృద్ధి, మిగిలిన పనులను పరిశీలించి ఇంకా పూర్తి చేయాల్సిన పనులను త్వరితగతిన చేయాలని కమిషనర్ కృత్తికాశుక్లా అధికారులను ఆదేశించారు. ఆమె వెంట ఆర్జేడీ ఐ.శారద, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పీబీ సాల్మన్‌రాజు, డీఈవో రామారావు, కళాశాల ప్రిన్సిపాల్ సుందర్‌లక్ష్మి ఉన్నారు.

ముగిసిన ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వర్కు షాపు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యాన గత ఐదు రోజులుగా జరుగుతున్న 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' వర్కు షాపు మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి శ్రీ గౌరి మాట్లాడుతూ ఐవోటీ ఇంటర్న్‌షిప్ చేయడం, డివైజ్ కోడింగ్ నేర్చుకోవడం ద్వారా మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించగలరన్నారు. రిసోర్స్‌పర్సన్, శాస్త్రవేత్త మురుగన్ ఐవోటీ, ఐవోటీ డివైజ్ ప్రోగ్రామింగ్, వైర్‌లెస్ ఇంటర్ఫేస్ వంటి అంశాలపై అవగాహన పరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం. ఏకాంబరం నాయుడు, ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యాన్ష్ ధాకరే, కళాశాల సెక్రటరి శ్రీకృష్ణ, టీపీవో శివనాగేశ్వరరావు, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీపై దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

పెనమలూరు: మండల పరిషత్ కార్యాలయంలో విధి నిర్వహణలో ఉన్న ఈవోపీఆర్డీ బొమ్మసాని శ్రీనివాసరావుపై దాడి చేసిన వ్యక్తిని కోర్టు రిమాండ్‌కు పంపింది. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు విధుల్లో ఉన్న సమయంలో స్థానికుడు ముప్పాళ్ల బద్రి నారాయణ వచ్చి వాగ్వాదానికి దిగాడు. గతంలో పెనమలూరు పంచాయతీపై పెట్టిన ఫిర్యాదులకు సంబంధించి అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఈవోపీఆర్డీపై ఒత్తిడి తీసుకొచ్చాడు. దీంతో గొడవ జరగగా ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పై బద్రినారాయణ దాడి చేశాడు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని మంగళవారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపర్చగా నిందితుడికి కోర్టు రిమాండ్ విధించి నెల్లూరు జైలుకు పంపారు.

ఉత్సాహంగా ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడులోని రవీంద్ర భారతి విద్యాలయంలో మంగళవారం ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ ఉత్సాహంగా జరిగింది. పాఠశాలకు చెందిన చిన్నారులు ఛత్రపతి శివాజీ, స్పైడర్ మాన్, రైతు, పోలీసు, దుబాయ్ షేక్, న్యూస్ పేపర్ డ్రెస్, పలు సాంస్కృతిక వేషదారణలతో ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఊర్వశి మాట్లాడుతూ చిన్నారులకు మన దేశ సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆయా దేశాల పద్ధతులపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యాసంస్థల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, అకడమిక్ డైరెక్టర్ శాంతి, అకడమిక్ హెడ్ రమాదేవి, రాజేష్, రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ



పెనమలూరులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల, ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు: సచివాలయాల ఉద్యోగులతో ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేస్తున్నామని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. పెనమలూరు గ్రామంలో మంగళవారం ఆయన పింఛన్ల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ నేతలు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు, పర్సే వెంకటస్వామి పాల్గొన్నారు.

ఉయ్యూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ఉయ్యూరు మండలంలోని 11 గ్రామాలు, మున్సిపాలిటీలోని 20 వార్డుల్లో నిర్వహించారు. పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీని ఎంపీడీఓ జీఎస్వీ శేషగిరిరావు పరిశీలించారు. కొత్తగా మంజూరైన ఐదుగురుకి వితంతు పింఛన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒకటి, రెండు నెలలు పింఛన్లు తీసుకోని లబ్ధిదారులకు మూడు నెలలు ఒకేసారి పింఛను సొమ్ము అందజేస్తున్నామన్నారు. ఉయ్యూరు పట్టణంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

విద్యార్థులకు సమాజ పరిస్థితులపై అవగాహన అవసరం



వెజిటబుల్ మార్కెట్ ప్రారంభంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్

గన్నవరం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు సమాజ పరిస్థితులపై చిన్న నాటి నుంచే అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వెజిటబుల్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. దీనికి ఎంతో కృషి చేస్తున్న పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా అభినందనీయులని చెప్పారు. విద్యార్థులు కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేసి రైతుల వేషధారణలో అమ్మకాలు చేశారు. తూకంలో తేడాలు, మోసాలు తల్లిదండ్రులకు వివరించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ నానారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అజీజ్ ఉల్లా, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోరంకి-నిడమానూరు రోడ్డు పరిశీలన

పెనమలూరు: పోరంకి గ్రామ పరిధిలో పోరంకి-నిడమానూరు రోడ్డును విస్తరించడానికి తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానీప్రసాద్ మంగళవారం పరిశీలించారు. పోరంకి-నిడమానూరు రోడ్డు మాస్టర్‌ప్లాన్ ప్రకారం డ్రెయినేజీలతో కలిపి 80 అడుగుల వెడల్పు ఉండాలి. అయితే రోడ్డు ఆక్రమణలతో కనీసం 20 అడుగులు కూడా లేదు. ఇందులో భాగంగా పనులు ఏ విధంగా చేయాలనే విషయమై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే మార్కింగ్ ఇచ్చామని, ఆక్రమణ దారులు స్వచ్ఛందంగా తప్పుకోవాలని సూచించారు. త్వరలో రోడ్డు విస్తరణ, డ్రెయినేజీ పనులు చేపడతామని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్ల గడువు రెండు నెలలు పొడిగింపు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు డిసెంబరులో ముగుస్తున్న నేపథ్యంలో కార్డుల కాలపరిమితిని రెండు నెలల పాటు పొడిగిస్తున్నట్లు జిల్లా సమాచార పౌరసంబంధాలశాఖ ఇన్‌చార్జి అధికారి మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 జనవరి 1నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు గడువు పొడిగించారని పేర్కొన్నారు. సమాచార పౌరసంబంధాలశాఖ సంచాలకుడు హిమాన్షు శుక్లా ఇచ్చిన ఆదేశాల ప్రకారం అక్రిడిటేషన్లు ఉన్న పాత్రికేయులకు ఫిబ్రవరి 28 వరకు పొడిగింపు సౌకర్యం కొనసాగుతుందని తెలిపారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

ఉయ్యూరు: తాతినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీనివాస అక్షరాలయంలో మంగళవారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు తాతినేని విజయ్ బాబు, సాయి ప్రత్యూష మాట్లాడుతూ లక్ష్య సాధన, ఆత్మ విశ్వాసం, సాంకేతికత, పర్యావరణం తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ పరుచూరి నీలిమ పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

పెనమలూరు: పోరంకిలో బాలిక అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం పోరంకి బ్రహ్మంగారి గుడి వద్ద ఉయ్యూరు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. అతని కుమార్తె (16) పోరంకిలో సూపర్‌మార్కెట్‌లో పని చేస్తుంది. కాగా సోమవారం పనికి వెళ్లిన కుమార్తె ఇంటికి వచ్చి తల్లిదండ్రులకు ఫోన్ చేసి తాను ఇంట్లోనే ఉన్నానని చెప్పింది. కాగా సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి కుమార్తె ఇంట్లో కనబడలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈవోపీఆర్డీపై దాడి అమానుషం



కంకిపాడు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

ఉయ్యూరు: పెనమలూరు ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుపై దాడి అమానుషమని ఉయ్యూరు ఎంపీడీఓ జీఎస్వీ శేషగిరిరావు అన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావుపై జరిగిన దాడిని నిరసిస్తూ మండల పరిషత్ కార్యాలయం ఎదుట అధికారులు, సిబ్బంది నల్లబ్యాడ్జీలతో మంగళవారం నిరసన తెలిపారు. దాడికి పాల్పడ్డ వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఓ లోయ శివశంకర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడు: పెనమలూరు మండల పరిషత్ ఈవోపీఆర్డీపై దాడి ఘటన అత్యంత హేయమైన చర్య అని ఉద్యోగులు విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, గద్దె రామ్మోహన్

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ప్రసాదంపాడు శ్రీ శక్తి కల్యాణ మండపం సమీపంలో రహదారి అభివృద్ధి పనులకు మంగళవారం విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ సీఆర్డీఏ నిధులు రూ. 3.54 కోట్లతో రహదారిని అభివృద్ధి పరచనున్నట్లు తెలిపారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే గన్నవరం, విజయవాడ తూర్పు, పెనమలూరు నియోజకవర్గ ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాల నాయకులు గూడవల్లి నరసయ్య, బొప్పన హరికృష్ణ, సర్నాల బాలాజీ, కోనేరు పెదబాబు, కొల్లా ఆనంద్, గోగం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

- బందరులో ముగ్గురిని అరెస్ట్ చేసిన చిలకలపూడి పోలీసులు
- డీఎస్పీ అబ్దుల్ సుభాన్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్

కోనేరుసెంటర్: జిల్లా కేంద్రం మచిలీపట్నంలో దొంగనోట్లను చెలామణి చేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 500 దొంగ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బందరు డీఎస్పీ అబ్దుల్ సుభాన్ తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మచిలీపట్నంకు చెందిన కన్నెగంటి రామకృష్ణ, వీరాచారి, సత్యనారాయణ, శివప్రసాద్ నగరంలో కొంతకాలంగా దొంగ నోట్లను చెలామణి చేస్తున్నారు. ఈ నెల 26న బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఎస్ఆర్డీ బార్ అండ్ రెస్టారెంట్లో మందు తీసుకొని రూ.500 దొంగ నోట్లు మార్చే ప్రయత్నం చేస్తుండగా అనుమానం వచ్చిన బార్ నిర్వాహకులు వారిలో ఒకరిని పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. చిలకలపూడి పోలీసులు హుటాహుటిన బార్ వద్దకు చేరుకుని దొంగ నోట్లు మారుస్తున్న రామృకృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు విచారణ చేసిన పోలీసులు రామకృష్ణ నుంచి మరింత సమాచారాన్ని సేకరించగా అతనితో పాటు వీరాచారి, సత్యనారాయణ, శివప్రసాద్ దొంగనోట్లు చెలామణి చేస్తున్నట్లు తెలుసుకున్నారు. కన్నెగంటి రామకృష్ణపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు మంగళవారం వీరాచారి, సత్యనారాయణ, శివప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. వారి నుంచి కొన్ని రూ.500 నకిలీ నోట్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో మరి కొంతమంది నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేస్తున్నట్లు తేలినట్లు డీఎస్పీ తెలిపారు. త్వరలో వారిని అరెస్టు చేయనున్నట్లు తెలిపారు. దొంగ నోట్ల చెలామణికి సంబంధించి వ్యాపారులకు అనుమానం వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలని కోరారు. సమావేశంలో చిలకలపూడి సీఐ నబి, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు ఆభరణాలు చోరీ చేసిన ముఠా అరెస్ట్

- వృద్ధులను బెదిరించి దొంగతనం
- రూ.4 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న ఏడీసీపీ రాజారావు, చిత్రంలో నిందితులు, ఆభరణాలు

విజయవాడస్పోర్ట్స్: ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధుల నోట్లో దుస్తులు కుక్కి, వారిని బెదిరించి బంగారు ఆభరణాలు దొంగిలించిన ముఠాను విజయవాడ సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను క్రైం ఏడీసీపీ ఎం.రాజారావు వన్‌టౌన్‌లోని సీసీఎస్ స్టేషన్ వద్ద మంగళవారం వెల్లడించారు. ఈ నెల 26వ తేదీన నున్న పీఎస్ పరిధిలోని దేవినేనిగాంధీపురం ప్రాతంలో నివసిస్తున్న వృద్ధుల ఇంట్లోకి అర్ధరాత్రి 12 గంటలకు వాంబేకాలనీకి చెందిన విన్నకోట శాలిని, గుంటూరు జిల్లా రుద్రవరం గ్రామానికి చెందిన యార్లగడ్డ హరిబాబు, పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరుకు చెందిన బెడేల్లి రాజేష్ చొరబడ్డారు. నిద్రిస్తున్న వృద్ధుల నోట్లో దుస్తులు కుక్కి బెదిరించి ఇంట్లోని బంగారు ఆభరణాలు దొంగిలించి పరారయ్యారు. మరుసటి రోజు బాధితుల ఫిర్యాదుపై నున్న పోలీసులు కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం కేసును పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబు సీసీఎస్‌కు అప్పగించారు. సీఐ పి.శ్రీనివాసరావు సాంకేతిక పరిజ్ఞానంతో సమగ్ర దర్యాప్తు చేశారు. దర్యాప్తు బృందాలకు వచ్చిన సమాచారం మేరకు ముగ్గురు నిందితులను దేవినేని గాంధీపురంలో మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏడీసీపీ రాజారావు తెలిపారు. ప్రధాన నిందితురాలు శాలిని తన మొదటి భర్తతో విభేదాల కారణంగా విడాకులు తీసుకుని, తిరుపతికి చెందిన మరో వ్యక్తిని వివాహం చేసుకుందని, అతనితో విడిపోయి వాంబేకాలనీకి మకాం మార్చిందని తెలిపారు. ఆ ప్రాంతంలో ఉండే నిందితులు హరిబాబు, రాజేష్‌తో పరిచయం పెంచుకుని, సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలు చేయడానికి పథకం రచించింది. స్థానిక వృద్ధ దంపతులపై వారి కన్ను పడింది. ముందస్తు వ్యూహం ప్రకారం వృద్ధుల ఇంట్లోకి చొరబడి దొంగతనం చేశారు. అనంతరం గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చేరుకుని ఒక వస్తువును తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులు పంచుకున్నారు. వాంబేకాలనీలోని శాలిని ఇంట్లో మిగిలిన వస్తువులను పంచుకుని బయటకు వస్తున్న వస్తున్న నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏడీసీపీ చెప్పారు. నిందితుల నుంచి 60 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏసీపీ సీహెచ్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చాలి

కంకిపాడు: బేడ(బుడగ), జంగాలను ఎస్సీ కులంలో చేర్చి తమ సామాజిక వర్గానికి న్యాయం చేయాలని బేడ(బుడగ), జంగం కుల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర ప్రచారకర్త పి.తిరపతిరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావును మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. తిరుపతిరావు మాట్లాడుతూ బేడ(బుడగ) జంగం ఎస్సీ కులానికి చెందినదన్నారు. తెలంగాణ నుంచి వలస వచ్చి కంకిపాడు పట్టణంలో నివాసం ఉంటున్నామన్నారు. ఎస్సీ వర్గీకరణ జాబితాలో తమ పేర్లు లేకపోవడం బాధాకరమన్నారు. ఎస్సీ కులానికి చెందిన తమ పేర్లను జాబితాలో చేర్చి ఎస్సీ వర్గీకరణ జాబితాలో తగు ప్రాధాన్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బేడ (బుడగ) జంగంను ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నిదానం సుబ్బారావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీను, కె.చింతయ్య, ఎం.లంకయ్య, ఎం.రాయప్ప తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న బుడగ జంగం ప్రతినిధులు

దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

గన్నవరం: దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు తమవంతు తోడ్పాటునందించాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం కేంద్ర ప్రభుత్వం, హిందుస్థాన్ ఏరోనాటికల్ సంయుక్త సహకారంతో 154 మంది దివ్యాంగులకు రూ. 27.14 లక్షల విలువైన ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న ఉపకరణాలను సద్వినియోగించుకోవాలని చెప్పారు. నియోజకవర్గంలో అర్హులైన దివ్యాంగులకు నివేశన స్థలాల పంపిణీకి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విజిలెన్స్ విచారణ కారణంగా నిలిచిపోయిన గ్రావెల్ తవ్వకాలను త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధిలో కూటమి నేతలందరూ తనతో కలిసి రావాలని కోరారు. ఎంపీడీఓ టి. స్వర్ణలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత దావాజీగూడెంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని యార్లగడ్డ ప్రారంభించారు.



బ్యాటరీ ట్రైసైకిల్స్ అందజేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ

నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు

ఉంగుటూరు: సాంకేతిక నైపుణ్య శిక్షణతో మెరుగైన అవకాశాలు పొందవచ్చని ప్రిన్సిపాల్ జీవీకేస్వీ ప్రసాద్ అన్నారు. తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఐబీఎం కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ తరగతులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ అశ్విన్‌కుమార్ మాట్లాడుతూ ఐబీయం స్కిల్ బుల్డ్ వెబ్‌సైట్‌లో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులతో ఎసైన్‌మెంట్ పూర్తి చేసి సాంకేతిక ప్రాజెక్టులు పూర్తి చేయడం ద్వారా ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సొసైటీల్లో సభ్యుల ఈకేవైసీ

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సభ్యత్వం ఉన్న వారి ఆధార్‌కార్డు ఆధారంగా ఈకేవైసీ చేస్తున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ తెలియజేశారు. నున్న గ్రామంలోని సచివాలయంలో జరుగుతున్న ఈకేవైసీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీలను కంప్యూటరీకరణ చేసిన నేపథ్యంలో ఖాతాదారుల ఈకేవైసీ జరుగుతోందన్నారు. మండలంలోని నున్న, విలేజి కండ్రిక, కొత్తూరు తాడేపల్లి, పైడూరుపాడు, గొల్లపూడి, రామవరప్పాడు, నిడమానూరు గ్రామాల్లోని సొసైటీల్లో మొత్తం 6,984 మంది సభ్యత్వం కలిగిన వారు ఉన్నారని తెలిపారు. ఈకేవైసీ ప్రక్రియ సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించినట్లు పేర్కొన్నారు.



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ బి.విగ్గిన్స్

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరు మాజీ సర్పంచ్ పరిమి రమేష్ 66వ జయంతిని పురస్కరించుకుని కుమారులు పరిమి వంశీ, కోడలు సింధూరలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం రూ. 40 వేలు విలువ జేసే స్కాలర్‌షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు క్రీడల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాఠశాల విద్యార్థులు పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. రాబోయే పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, గ్రామానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని సూచించారు. ప్రతిభ గల పేద విద్యార్థులకు తమ వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అలాగే పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు రూ. 50వేలు ఆర్థిక సహాయం అందించారు.



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న వంశీ, సింధూర

8న మండల పరిషత్ సమావేశం

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 8వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల అధ్యక్షుడు చెన్ను ప్రసన్నకుమారి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రూరల్ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ శాఖల పని తీరుపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

ఉచిత యోగభ్యాసం

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ పటమటలోని గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో నూతన సంవత్సరం సందర్భంగా మంగళవారం దత్తక్రియ యోగ సాధన శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. యోగా బోధకులు పాల్గొన్నారు.